క్లుప్తంగా

అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి



లింగంపర్తిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: గ్రామాల్లో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి తెలిపారు. మండలంలోని లింగంపర్తి, తిరుమాలి గ్రామాల్లో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. లింగంపర్తిలో రూ.25 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు, జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైకిల్ స్టాండ్ నిర్మాణం, తిరుమాలిలో రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామన్నారు. రానున్న రోజుల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు వరుపుల దుర్గావేణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



నూకాలమ్మతల్లిని దర్శించుకుంటున్న వైఎస్సార్ సీపీ నాయకులు యనమల కృష్ణుడు, పోతల రమణ

తుని రూరల్: మండలంలోని లోవకొత్తూరులో రూ.కోటితో నిర్మించిన నూతన ఆలయంలో నూకాలమ్మతల్లి విగ్రహాన్ని వైభవోపేతంగా ప్రతిష్ఠించారు. సోమవారం ఉదయం 10.22 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు యనమల కృష్ణుడు, పోతల రమణ, లంక కృపానందం, దాడిశెట్టి శ్రీనివాసరావు తదితరులు అమ్మవారిని దర్శించారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

తుని: క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం తునిలో పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు కాదంబరి రామకృష్ణ అధ్యక్షతన పార్టీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ కొత్తగా నియమించిన మండల కమిటీలు పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. బూత్ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి లక్ష్య సాధనకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. నూతనంగా నియమించిన అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను అభినందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు, కోశాధికారి చోడిశెట్టి రమేష్, తుని నియోజకవర్గ కన్వీనర్ వెలుగుల గోపాలకృష్ణ, మలిపెద్ది రాంబాబు, బొప్పన బాబూరావు, పవన్‌కుమార్, అభిలాషబాబు పాల్గొన్నారు.

కాలువ పనుల పరిశీలన

కోటనందూరు: స్థానిక నిమ్మకట్టు చానల్‌పై జరుగుతున్న కాలువ పనులను ఆయకట్టు రైతులు సోమవారం పరిశీలించారు. పనులు జరిగే తీరును అధికారులు, కాంట్రాక్టరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పనుల వల్ల తమకు శాశ్వత పరిష్కారం దొరకదన్నారు. నిమ్మకట్టు నుంచి కనీసం కిలోమీటరు మేర సీసీ లైనింగ్ పనులు చేయాలని, గట్టుపై ఇనస్పెక్షన్ పాత్ ఏర్పాటు చేయాలని, ఆక్రమణకు గురవుతున్న గట్లను సర్వే చేసి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీసీ ఉపాధ్యక్షుడు అప్పన దివాణం, రైతులు సత్యసీతయ్య, వనిమిన సూర్యారావు, వీసం నూకరాజు, వాసం నాగేశ్వరరావు, రాంపల్లి వెంకటరమణ, వర్క్ ఇనస్పెక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

జగ్గంపేట: మండలంలోని సీతానగరంలో దేవి ఫిషరీస్ సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను సోమవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ప్రారంభించారు. కార్యక్రమంలో దేవి ఫిషరీస్ ప్రతినిధి ఆకాష్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గండేపల్లి: ప్రస్తుత వేసవిలో చలివేంద్రాల ఏర్పాటుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ చలగళ్ల దొరబాబు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు, హైవేపై ప్రయాణికుల సౌకర్యార్థం చలివేంద్ర ఏర్పాటు చేసినట్టు తెలిపారు. తొలి రోజు మజ్జిగ పంపిణీ చేశారు. జూన్ నెల వరకూ ఈ చలివేంద్రం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాతి బుజ్జి, ఏఓ కె.చంద్రరావు, ఎంఈఓ నాయక్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో పరీక్ష కేంద్రం వద్ద హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



తొండంగి జెడ్పీ హైస్కూల్లో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్‌లో హాల్ టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



కత్తిపూడిలో క్యూకట్టి పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

ప్రశాంతంగా పది పరీక్షలు

- అన్ని కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత
- తొలిరోజు 12 మంది విద్యార్థుల గైర్హాజరు

ఏలేశ్వరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నియోజకవర్గవ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు 8:30 గంటలకే చేరుకున్నారు. పరీక్షలు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకూ జరిగాయి. ఏలేశ్వరంలో నాలుగు, లింగంపర్తి ఒక కేంద్రంలో మొత్తం 931 మంది విద్యార్థులకు గాను 12 గైర్హాజరయ్యారు. 919 మంది పరీక్షలు రాశారు. మండలకేంద్రమైన ఏలేశ్వరంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భాష్యం స్కూల్, శ్రీవిద్యాస్కూల్, లింగంపర్తిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం విద్యార్థులు తోటివారితో రాసిన పేపర్‌పై చర్చించుకున్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల సూపరింటెండెంట్‌గా ఎస్.గణపతిరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల సూపరింటెండెంట్‌గా ఎన్.లక్ష్మీతులసి భాష్యం స్కూల్ సూపరింటెండెంట్‌గా ఆర్.కల్యాణ్, శ్రీవిద్యా స్కూల్ సూపరింటెండెంట్‌గా ఎస్.నాగరాజు, లింగంపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల సూపరింటెండెంట్‌గా ఎం.బచ్చయ్య పరీక్షలను పర్యవేక్షించారు.

రౌతులపూడి: మండలంలోని రౌతులపూడి, ములగపూడి జెడ్పీ హైస్కూళ్లు, ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రాల్లో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. రౌతులపూడి జెడ్పీ హైస్కూల్‌లో మొత్తం 247 మంది విద్యార్థులకు గాను ఐదుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. ములగపూడి జెడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో 182 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసి ఉండగా ఐదుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఎ.మల్లవరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో 168 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావలసివుండగా ఆరుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని ఎంఈఓ–2 గాడి కొండబాబు తెలిపారు. ఈ మూడు పరీక్షా కేంద్రాల్లో 16 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేదన్నారు. విద్యార్థులకు తాగునీరు, విద్యుత్, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించారు.



తునిలో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

పటిష్ఠ ఏర్పాట్ల నడుమ..

తుని: పటిష్ఠ ఏర్పాట్లు, బందోబస్తు నడుమ పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు తెలుగు పరీక్ష నిర్వహించినట్టు ఎంఈవో పరవాడ గీతాదేవి తెలిపారు. తుని పట్టణం, మండల పరిధిలో 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు. 2202 మందికి గాను 2198 మంది పరీక్షకు హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పరీక్ష కేంద్రాల వద్ద మంచి నీరు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ ఉచిత బస్సులను ఏర్పాటు చేసింది. పరీక్షా కేంద్రాలకు గంట ముందే విద్యార్థులు చేరుకున్నారు. పరీక్ష ముగిసిన తర్వాత విద్యార్థులు సురక్షితంగా ఇళ్లకు చేరుకున్నారు.

గోకవరం: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గోకవరం, కామరాజుపేట, రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూళ్లు, భూపతిపాలెం బాలుర గురుకుల పాఠశాల, వీరలంకపల్లి బాలికల గురుకుల పాఠశాలల్లో పరీక్షలు నిర్వహించారు. తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 748 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 10 మంది గైర్హాజరైనట్టు ఎంఈఓ బి.గౌరమ్మ తెలిపారు. ఉదయం ఆయా పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు సందడి చేశారు. తొలిరోజు కావడంతో పరీక్ష కేంద్రాలకు నిర్ణీత సమయం కంటే గంట ముందే విద్యార్థులు చేరుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

తొండంగి మండలంలో ఐదుగురు..

తొండంగి: మండలంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో సోమవారం టెన్త్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. నాలుగు సెంటర్లలో ఐదుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. దానవాయిపేట జెడ్పీ హైస్కూల్లో 244 మందికి గాను ఇద్దరు బాలికలు, బెండపూడి జెడ్పీ హైస్కూల్ సెంటర్‌లో 199 మందికి గాను ఒకరు, కొత్తపెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్ సెంటర్‌లో 226 మందికి గాను ఇద్దరు బాలురు హాజరు కాలేదు. శృంగవృక్షం జెడ్పీ హైస్కూల్‌లో సెంటర్‌లో 240 మంది నూరు శాతం హాజరయ్యారు. నాలుగు సెంటర్లలో 806 మందికి ఐదుగురు గైర్హాజరు కాగా 801 మంది హాజరయ్యారని మండల విద్యాశాఖాధికారి షేక్ బాబ్జి తెలిపారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆయన వివరించారు.

ప్రత్తిపాడు మండలంలో 15 మంది గైర్హాజరు

ప్రత్తిపాడు: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఐదు పరీక్ష కేంద్రాల్లో తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు పదిహేను మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో 190 మందికి గాను 188 మంది, ధర్మవరం జెడ్పీ హైస్కూల్‌లో 130 మందికి 128 మంది, లంపకలోవ జెడ్పీ హైస్కూల్‌లో 245 మందికి గాను 236 మంది హాజరు కాగా ఒమ్మంగి జెడ్పీ హైస్కూల్ ఎ సెంటర్‌లో 96 మందికి 96 మంది, ఒమ్మంగి బి సెంటర్‌లో 197 మందికి 195 మంది విద్యార్థులు హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి వి.రాజబాబు తెలిపారు.

కిర్లంపూడి మండలంలో ఏడుగురు...

కిర్లంపూడి: మండలంలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో సోమవారం జరిగిన పదో పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. మండలంలోని పరీక్ష కేంద్రాల్లో మొత్తం 917 మందికి గాను 910 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ఠమైన ఏర్పాట్లు చేశారు.

కోటనందూరు మండలంలో నలుగురు..

కోటనందూరు: మండలంలో జరిగిన పదో తరగతి పరీక్షలకు నలుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు ఎంఈఓలు శ్రీనివాసు, రామశేఖర్ సోమవారం తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో 576 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా నలుగురు విద్యార్థులు హాజరు కాలేదు. పరీక్ష కేంద్రాలను ఎంఈఓలు తనిఖీ చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

శంఖవరం: మండలవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఎంఈఓ ఎస్‌వీ రమణ తెలిపారు. శంఖవరం జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్, కత్తిపూడి జెడ్పీ హైస్కూల్, అన్నవరం దేవస్థానం హైస్కూల్లో మొత్తం 774 మంది విద్యార్థులకు గాను 767 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. ఏడుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కాలేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 8.30 గంటల లోపే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తాగు నీరు, వైద్య సదపాయం కల్పించారు. అన్నవరం ఎస్సై హరిబాబు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గండేపల్లి: తొలి రోజు పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 488 మంది విద్యార్థులకు గాను ఏడుగురు పరీక్షలకు గైర్హాజరయ్యారు. గండేపల్లిలో పరీక్ష కేంద్రాన్ని ఎంపీడీఓ నాతి బుజ్జి తనిఖీ చేశారు.

జగ్గంపేటలో

జగ్గంపేట మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1118 మంది విద్యార్థులకు గాను తొమ్మిది మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు.

తల్లి సాయంతో పరీక్ష కేంద్రానికి...

తొండంగి: పోలియో కారణంగా దివ్యాంగుడైన తన కుమారుడుని టెన్త్ పరీక్షలు రాసేందుకు ఓ మాతృమూర్తి ఎత్తుకుని పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చిన సంఘటన పెరుమాళ్లపురం జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం చోట చేసుకుంది. ఏవీ నగరం గ్రామానికి చెందిన సిద్దాంతపు కార్తీక్ పదో తరగతి చదువుతున్నాడు. టెన్త్ పరీక్ష కేంద్రం పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో కేటాయించడంతో తల్లి నాగలక్ష్మి తన కుమారుడుని ఎత్తుకుని పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చింది. దివ్యాంగుడైన కుమారుడిని పరీక్ష కోసం ఎత్తుకుని తీసుకుని రావడం తల్లి ప్రేమకు నిదర్శనంగా నిలిచింది.



పెరుమాళ్లపురంలో దివ్యాంగ విద్యార్థి కార్తీక్‌ను పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చిన తల్లి నాగలక్ష్మి

ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1,200 మంది ఓటర్లు

- నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు
- పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 1,200 మందే ఓటర్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ప్రత్తిపాడు నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ కార్య నిర్వాహక సంచాలకుడు ఎ.శ్రీనివాసరావు తెలిపారు. ఒకవేళ 1,200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నచోట ప్రత్యామ్నాయంగా పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంటుందన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకే ప్రాంతంలో రెండు పోలింగ్ కేంద్రాలు పక్కపక్కనే లేకుండా ఉండేలా సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామన్నారు. నియోజకవర్గంలోని ఏలేశ్వరం నగర పంచాయతీ, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో 227 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటి పరిధిలో 1,07,378 మంది పురుషులు, 1,10,250 మంది స్త్రీలు, 21 మంది ఇతరులు వెరసి 2,17,649 మంది ఓటర్లున్నారన్నారు. ఇంకా నమోదు కాని ఓటర్లుంటే రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితాలో చేర్చేందుకు రెవెన్యూ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి శ్రీనివాసరావు

పోలింగ్ కేంద్రాలు మార్చాలి

ప్రత్తిపాడులోని ఆర్‌సీఎం పాఠశాల శాశ్వతంగా మూతపడినందున ఆ పాఠశాలలోని 92 నుంచి 95 వరకూ గల పోలింగ్ కేంద్రాలను మరో సురక్షితమైన ప్రాంతంలో ఏర్పాటు చేయాలని రాజకీయ పార్టీల నేతలు కోరారు. దీనిపై పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. సమావేశంలో ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల తహసీల్దార్లు ఎం.సూర్యప్రభ, కుశరాజు, నరేష్, తాతారావు, ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ ఎం. సత్యనారాయణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, ధరణాలకోట శ్రీను, కొండపల్లి శ్రీను, మానుకొండ లచ్చబాబు, మోర్త వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటించాలని వినతి

ప్రత్తిపాడు: రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ కొత్త కమిటీ ఏర్పాటు కంటే ముందు ఐఆర్ ప్రకటించాలని ప్రత్తిపాడు మండల విశ్రాంత ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం తహసీల్దార్ ఎం.సూర్యప్రభకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పీఆర్సీలోని ఏరియర్స్, డీఏ బకాయిలు ఇంతవరకు చెల్లించలేదన్నారు. రిటైర్డ్ ఎంప్లాయీస్‌కు ఎన్టీఆర్ హెల్త్ స్కీమ్ కింద కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం చేయించుకునేందుకు, ఎడిషనల్ క్వాంటమ్ పెన్షన్ మంజూరుకు ప్రభుత్వం తక్షణమే ఉత్తర్వులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రతినిధులు ముక్కు సుబ్రహ్మణ్యం, జంధ్యం సుబ్బారావు, బేతా సత్యనారాయణ, పీలా వెంకటరమణ, మర్రిపూడి సుబ్రహ్మణ్యం, బర్రే కోటేశ్వరరావు, గుడిమళ్ల లక్ష్మణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో తహసీల్దార్ సూర్యప్రభకు వినతి పత్రం అందిస్తున్న విశ్రాంత ఉద్యోగులు


సింగరమ్మతల్లికి ప్రత్యేక పూజలు

జగ్గంపేట: మండలంలోని మల్లిసాల శివారు సింగరమ్మ చింత వద్ద వేంచేసిన సింగరమ్మతల్లి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఆయనకు పండితులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత తోట రాంజీ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మల్లిసాలలో సింగరమ్మతల్లిని దర్శించుకుంటున్న తోట నరసింహం

నేడు అన్నవరానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్



అడుగంటిన నీటితో పంపా రిజర్వాయర్

అన్నవరం: రత్నగిరిపై ఏప్రిల్, మే నెలల్లో జరిగే శ్రీరామనవమి, సత్యదేవుని కల్యాణ మహోత్సవాలను దృష్టిలో ఉంచుకుని పంపా రిజర్వాయర్‌కు ఏలేరు నీరు విడుదల చేయించాలనే అన్నవరం దేవస్థానం అధికారుల అభ్యర్థనపై క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మంగళవారం అన్నవరం వస్తున్నారు. ఉదయం 11 గంటలకు ఆయన పంపా నదీగర్భంలో నిర్మిస్తున్న పోలవరం అక్విడెక్ట్ వద్దకు చేరుకుని పోలవరం అధికారులతో మాట్లాడుతారని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. పోలవరం అక్విడెక్ట్ పనులు, పంపా గేట్లు మరమ్మతుల కోసం పంపాలో నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో పంపా రిజర్వాయర్ దాదాపుగా డెడ్ స్టోరేజీ స్థాయికి చేరింది. పోలవరం పనుల కోసం పంపాలోకి నీరు రాకుండా మట్టితో అడ్డుకట్టు వేశారు. ఏలేరు నుంచి నీరు విడుదల చేసినా పంపాకు నీరు వచ్చే పరిస్థితి లేదు. ఈ విషయం పోలవరం అధికారులు కలెక్టర్‌కు స్పష్టం చేయడంతో స్వయంగా పరిశీలించడానికి ఆయన వస్తున్నారని అధికారులు తెలిపారు. అనంతరం అన్నవరం దేవస్థానం వ్యవహారాలపై కూడా కలెక్టర్ సమీక్షించనున్నారు.

దివ్యాంగులకు ఆట వస్తువుల పంపిణీ

తుని: దివ్యాంగ చిన్నారులకు దాతలు అండగా నిలవాలని సిటీ కేబుల్ ఎండి చోడిశెట్టి త్రిమూర్తి స్వామి అన్నారు. పట్టణంలోని సిటీ కేబుల్ కార్యాలయంలో సోమవారం శంకర్ ఫౌండేషన్, సహస్ర ఆర్థో పెడిక్ హాస్పటల్ సహకారంతో దివ్యాంగులకు ఆట వస్తువులు, తినుబండాలరాలను పంపిణీ చేశారు. దివ్యాంగులకు చేయూతను ఇచ్చేందుకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు జగన్నాథం, నాగేశ్వరరావు, వాసు దేవరావు తదతరులు పాల్గొన్నారు.



తునిలో చిన్నారులకు ఆట వస్తువులను అందజేస్తున్న త్రిమూర్తి స్వామి

బోధనా సామగ్రి బహూకరణ

తొండంగి: స్థానిక భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు శంకర్ ఫౌండేషన్ నిర్వాహకులు సోమవారం బోధనా సామగ్రి, ఆట వస్తువులను అందజేశారు. తునికి చెందిన శంకర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, సిటీకేబుల్ ఎండీ చోడిశెట్టి త్రిమూర్తిస్వామి రూ.10 వేలు విలువైన బోధనా సామగ్రిని పిల్లలకు అందజేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలు విద్యలో రాణిస్తున్నారన్నారు. వనరులను సద్వినియోగం చేసుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంఈవో షేక్‌బాబ్జి, ఐఈఆర్టీ వలంటీర్లు జగన్నాథరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో కోడి పందేల శిబిరంపై దాడి చేసి ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు స్థానిక ఎస్సై జగన్మోహన్‌రావు సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పెరుమాళ్లపురం గ్రామ సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో సామర్లకోట మండలం పనసపాడుకు చెందిన లింగం శ్రీనివాసరావు, యు.కొత్తపల్లి మండలం శ్రీరాంపురానికి చెందిన అంబుజాలపు సూరిబాబులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15960, రెండు కోడిపుంజులు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ప్రత్తిపాడు రూరల్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సరిత సూచించారు. మండలంలోని పెద్దిపాలెంలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం ఎంపీపీ గొళ్ల కాంతి సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధికి పలు సూచనలు చేసి, తీర్మానాలను ఆమోదించారు. అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డాక్టర్ సరిత మాట్లాడుతూ ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. పెద్దిపాలెం, పరిసర గ్రామాల ప్రజలు ఆసుపత్రిలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులు రత్నంబాబు, డాక్టర్ యశస్వి, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు లొండ బాబు, పినిశెట్టి ప్రకాష్, ఏఎన్ఎంలు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



పెద్దిపాలెం పీహెచ్‌సీలో మొక్క నాటుతున్న డాక్టర్ సరిత, ఎంపీపీ కాంతిసుధాకర్

చోరీకి గురైన ధాన్యం స్వాధీనం

గోకవరం: మండలంలో ఈ నెల 11న చోరీకి గురైన ధాన్యాన్ని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... రంపయ్రంపాలేనికి చెందిన గంటా బుల్లివెంకటేశులు గోకవరం, రంపయర్రంపాలెం గ్రామాల మధ్య పంట పొలాన్ని కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. ఐదు నెలల పాటు కష్టించి పండించిన వరి ధాన్యాన్ని మూటలు కట్టి రంపయర్రంపాలెం వెళ్లే మార్గంలో రహదారి చెంత అమ్మకానికి ఉంచాడు. ఈ క్రమంలో ఈ నెల 11న అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధాన్యాన్ని చోరీ చేశారు. దీనిపై బాధితుడి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు ప్రారంభించారు. దేవీపట్నం మండలం ఇందుకూరుపేట గ్రామానికి చెందిన సత్తినాటి వీరబాబును అనుమానితుడిగా గుర్తించి విచారించారు. ఆన్‌లైన్‌లో బెట్టింగులకు అలవాటు పడి అప్పులపాలవ్వడంతో వివిధ ప్రాంతాల్లో రోడ్డు పక్కన ఉంచిన సుమారు 70 క్వింటాళ్ల ధాన్యం దొంగిలించినట్టు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. నిందితుడిని అరెస్టు చేసిన అతని నుంచి ఒక ఆటో, 14 క్వింటాళ్ల వరిధాన్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ధాన్యం రికవరీ చేసిన పోలీసులకు రైతు బుల్లివెంకటేశులు కృతజ్ఞతలు తెలిపాడు.



స్వాధీనం చేసుకున్న ఆటో, ధాన్యంతో ఎస్సై పవన్‌కుమార్, సిబ్బంది